# అనురాగ లత




యల్. కిరణ్ కుమార్

అనురాగం, లత జీవితం, ఈ రెంటిలో ఏదో సామ్యం కన్పిస్తుంది వృద్ధిక్షయాలు ఈ రెంటికీ ఒకటే. వసంతంలో అందంగా, ఆనందంగా విర్రవీగే లత గ్రీష్మం వచ్చేటప్పటికి చప్పగా చల్లారిపోతుంది. వసంతంలోనైనా అతి కోమలంగా పెంచితేనే అది వికసించి పుష్పిస్తుంది, లేకపోతే నశిస్తుంది. అనురాగం కూడా అంతే రోజుకు రేయింబవళ్లలానూ, మానవజీవితానికి వెలుగు, నీడ లలాను.

పై విషయాన్ని నిరూపించే నాకు తెలిసిన నో యింజనీరు జీవితాన్ని మీముందుంచాలని యత్నిస్తున్నా.

* * *

"ఏమండోయ్ ! ఈవేళటి ప్రోగ్రామ్ విషయం మర్చిపోయారా ?" తన అందమైన కళ్లను మరింత అందంగా త్రిప్పిం దామె. ఆమె పేరు భారతి.

"ఊహుఁ, నేను రాను" తన కర్కశానికి తనే ఆశ్చర్యపోతూ అన్నాడతడు.

అతడు అంటే హరి. కంపెనీ క్వార్టర్సులో ఉండవలసి వస్తే తిరిగి నల్గురిలో మెలగవలసి వస్తుందని, వంటరితనాన్నాసించి, వాంఛించి వూరికి దూరంగా వో యింటి నద్దెకి తీసుకున్నాడు. భారతి ఆ యింటి యజమాని ఏకైకపుత్రిక అందంలో రతీదేవంతటిది అనకపోతే నిజంగా దెబ్బలాటకొస్తుందేమోననే భయం లేకపోలేదు. సంక్రాంతి సెలవలకు యింటికొచ్చింది కాన్వెంటునుంచి వచ్చిన రెండు రోజులకే హరి నాకట్టుకొంది అందు కామె అందమే కేవలం కారణం కాదనుకుంటూ. నిర్మలమైనది ఆమె హృదయమని చెప్పవచ్చు అందానికి ప్రాముఖ్యత ఖ్యాయని హరిలాంటివాడిమె

స్నేహాన్ని కోరుకున్నాండటంటే అదే కారణం కావచ్చు.

"ఈవేళ పార్కుకు వస్తానన్నారుగా. రెండు రోజులలో నేను తిరిగి కాలేజీకి పోవాలి కదండీ. ఈవేళ దయుఉంచి మీ గురించి అంతా చెప్పేయాలి. ఇంక వాయిదాలు వేయరుగా" ప్రతిమాలుతూ అడిగిందామె.

ఇటువంటి వాటికి లొంగేవాడు కాకపోయినా, ఆమెను నొప్పించటాన్కి యిష్టంలేకనో, వాయిదాలు వేయడం యిష్టంలేకనో మెకానికల్‌గా ఆమె ననుసరించాడు, మెకానికల్ యింజనీరు హరి.

హరి తాతా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీలో యింజనీర్‌గా ప్రవేశించి ఇంకా ఒక్క సంవత్సరమైనా కాకపోయినా, అతని సిన్సియారిటీని అతని తెలివితేటలను చూసి, కంపెనీవాళ్ళు ఫారిన్ పంపుదామనుకోవడం మాత్రం నిజం. హరి తన ఎం. ఇ రెండవ సంవత్సరము చదువుతూ మానివేసాడు ఎందుకు మానివేశాడు అంటే ఎవరికీ తెలియదు అతను ఫారిన్ ఛాన్సు కూడా తిరస్కరించటాన్కి సిద్ధంగా ఉన్నాడు. ఏం ? అనడిగితే ఎవరికోసమని తిరిగి ప్రశ్నిస్తాడు ? కాని జవాబీయడు

ఎవరికీ తెలియని ఈవిషయాలనే ఆమె తెల్సుకో గోరుతున్నది హరి బయలు దేరే ముందు జేబులో పెట్టుకొన్న డైరీని మరోసారి తడుముకున్నాడు

పార్కులో మెత్తని గడ్డిమీద కూర్చున్నాక—

"ఏమండీ?" ఎంతో తీయగా మాట్లాడిందామె.

"ఏం?"కర్కశమైన జవాబు.

"నేనంటే మీకిష్టమేనా?" అందమైన ఆమె బుగ్గలు అరుణ వర్ణం దాల్చాయి.

"అలాంటి పిచ్చి ప్రశ్నలంటే నాకు పిచ్చికోపం". అతని సమాధానం

ఈసారి ఆమెకు నిజంగా కోపం వచ్చింది. కాని అడదానికి ఆజ్ఞాపించే వాడి మీదున్న యిష్టం అనుసరించే వాడి మీదుండదనే విషయమే అనుకుంటూ ఆమె కతని మీద యిష్టాన్ని ఎక్కువ చేసింది

"మీ గురించి ఈవేళ చెబుతానన్నారుగా? మీరు ఎమ్ ఇ చదువుతూ ఎందుకు మానివేశారో చెప్పరూ?" ఎందుకో ఆమె కతని గురించి తెలుసుకోవాలనే అభిలాష.

"ఎందుకా పాత విషయాలు. అనవసరంగా అవన్నీ జ్ఞాపకం తెచ్చుకోవడం నాకంత యిష్టం లేదు." తనబాధ మరొకరితో చెప్పుకుంటే వుపశమిస్తుందనే ఆశ అతని మాటల్లో తొంగి చూస్తుంది

"ప్లీజ్! మీ గురించి నాకెందుకో తెలుసుకోవాలని అభిలాషగా వుంది దయువుంచి చెప్పరూ?" గోముగా అడిగిందామె అతనివైపేచూస్తూ.

"మరి నీవు నావైపట్లా చూడొద్దని చాలా సార్లు చెప్పాను". ఆడవాళ్ల హృదయాలతో నేనాడుకోలేను అనేది ధ్వనిస్తుందా మాటలో.

"సర్లెండి, యింక మొదలు పెట్టరూ" పైకి చూడ లేక, గడ్డిని చేతితో తృంచుతూ అడిగిందామె.

* * *

అది నేను బి.ఇ. ఆఖరి సంవత్సరము చదివే రోజులు. అన్నయ్య రమ్మంటే వాళ్ళ వూరెళ్ళాను వేశవి శెలవలకు. అన్నయ్య కాకినాడలో ఆర్.డి.ఒ. గా పనిచేస్తున్నాడు. మావదిన దేవత లాంటిది. ఆరోజు అన్నయ్య క్యాంపుకు వెళ్ళాడు. ఎవరో అమ్మాయితో వదిన మాట్లాడుతుంది. ఆ అమ్మాయి మాటలను వినటాన్కి ఉపక్రమించా, నిద్రపోతున్నట్టు నటిస్తూ, అది తప్పని తెలిసినా.

వాళ్ల మాటలనుబట్టి ఆ అమ్మాయి పేరు అరుణ అని, ఆమెకు వదిన అక్కవరస అవుతుందని, నాగురించామె చాలా అడిగి తెల్సుకున్నదని గ్రహించా. చూడ బుద్ధివేసింది. చూసా. కాని, నావైపే చూస్తున్న ఆమె వాడియైన చూపులను, నా చూపులు లను ఢీకొన్నాయి. కొన్ని నిముషాలు గడిచాయి ఎంత అందమైన దీమె అనుకున్నాను! అయినా చిన్నప్పటినుంచీ అందానికి ప్రాముఖ్యత యీయని నే నామెను చూడగానే అందంగా ఉందీమె అన బుద్ధివేసింది. మరునాడు వదిన ఆమెను పరిచయం చేసింది. మా నిన్నటి పరిచయం తెలియక కాబోలు. వదిన చాలా మంచిదనుకున్నా మరోమారు. ఆమెతో తొలి పరిచయంనాడు మాట్లాడిన మాటలు మా జీవితాలని మార్చివేశాయి ఎందుకో నాకామెతో యింకా మాట్లాడా లనిపించేది.

చిన్న చిన్న చీటీలతో ఆరంభమైన మా స్నేహం నీవే బందిపోటు దొంగవు, నా హృదయాన్ని దోచుకున్నావు అంటే "మీరే" అనే వరకు వచ్చింది

"నేను నిద్రపోయేటప్పుడు అంటే నా హృదయము నా దగ్గర లేనప్పుడు నీవే వచ్చి దొంగిలించేశావు" అని ఏడ్పించేవాడ్ని. బుంగమూతి పెట్టిన ఆమె మోము నాకు మరీ మరీ చూడాలన్పించేది

ప్రతీరోజు సర్దాగా గడిచిపోయేది. ఒకరి కళ్లలోకి ఒకరం చూసుకుంటూ గడిపేసేవాళ్లం హాయిగా రోజుల్ని. రోజు అరుణ మా యింటికి వచ్చేది. అన్నయ్య ఆఫీసులో ఉండేవాడు. వదిన మాతో సహకరించేది మాయింటి దగ్గరలోనే ఒక పార్కుంది. ఓరోజు పార్కులో ఉన్నాం మేమిద్దరం. అన్నయ్య ఆ దారినే ఇంటికి వెడుతూ చూశాడు నాకు భయంవేసింది కాని అన్నయ్య నవ్వుతూ "విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్" అన్నట్టుచూసి వెళ్లిపోయాడు. బ్రతుకుజీవుడా అన్నట్టున్న నన్ను చూసి అరుణ అందంగా నవ్వింది. ఆరోజు నే నెంతగా సంతోషించానో నాకే తెలియదు

మరోరోజున మా రిజల్ట్సు వచ్చాయి. మంచి మార్కులతో పాసయిన నన్ను అన్నయ్య అభినందించాడు. వదిన అది అరుణ అదృష్టం అంది అన్నయ్య నవ్వుతున్నాడు. వదినమీద చిరుకోపం కూడా ప్రదర్శించలేకపోయా. అన్నయ్య ముందు ఎందుకో సిగ్గు. అది సిగ్గో, భయమో

"పో వదినా! నువ్వు మరీను" అమ్మాయికన్నా ఎక్కువ సిగ్గుపడిపోయా అన్నయ్య ఎం ఇ. చదవమని ఆర్డరు జారీచేశాడు వదిన ముందు పెళ్లిచేసేయాలంది. నాకు రెండూ బాగానే ఉన్నట్టనిపించాయి. కాని ఎం. ఇ చదవడానికే నిశ్చయించుకున్నా. అన్నయ్య లేరనుకుని వస్తున్న అరుణ అన్నయ్యను చూసి గతుక్కుమంది.

"రా అరుణా! వో ఐ సీ! మీకేదైనా ప్రోగ్రాం ఉందనుకుంటా. మరిచిపోయా, మీ హరి ఫస్టు క్లాసులో పాసయాడు" ఇంక నా పని అయిపోయిందన్నట్టు, నావైపు చూసాడు. అన్నయ్య ముందేమీ మాట్లాడలేకపోయా. ఆవేళ ఏదో సినిమాకు వెళ్లాం. "నాకు ట్రేజడీలంటే బలే భయం బాబు" అంది. నాకు చాలా యిష్టం అన్నా. ఆఖరికి వో ట్రాజడీ సినిమాయే చూసాం.

ఎం. ఇ. అప్లికేషను పడేసా. శెలవలు హాయిగా గడిచిపోయాయి. కథలలోను, సినిమాలలోను ప్రేమించుకోవడం చాలా తేలిక, నిజ జీవితంలో అది చాలా కష్టం అనే మా రూమ్‌మేట్‌తో ఏకీభవించేవాడ్ని ఒకప్పుడు. కాని నా కలిప్పుడు సమంజసంగా తోచడంలేదు. ఏ డ్యూయట్స్, ఏ లవ్ సీన్సు లేకుండానే మేము మరింత సన్నిహితులమయాం.

వదినా అన్నయ్యలు ప్రోత్సాహ మిచ్చారు. అమ్మానాన్నలు బలపర్చారు. ఇక అడ్డులేని మా ప్రేమ కలాపాలు నిర్విఘ్నంగా కొనసాగించాం నా ఎం. ఇ. మొదటి సంవత్సరంలో—అందం, డబ్బు ఉన్నవారికి అహం ఉంటుం దంటారు. కాని యిది అరుణకు చెందదు. నిష్కల్మషమైన ఆమె హృదయం నన్ను చేరువకు తీసుకుంది. మాకు పెళ్లిసంబంధం నిశ్చయమైనదని తెలియగానే 'ఎంత సంతోషించానో చెప్పలేను ఆ సంతోషంలో రూమ్‌మేట్ 'ఈశు' ని ముద్దు పెట్టేసుకున్నా. ఎప్పుడైనా దారి తప్పనున్న, నన్నతడు మందలించేవాడు రక్త సంబంధీకులైన తమ్ముళు లేని నా కతడు తమ్ముడయాడు జాగ్రత్తగా చదవమని హెచ్చరించాడు. అది నా రెండవ సంవత్సరము.

"ఓ సంఘటన నా కిక్కడ చెప్పాలని ఉంది. వింటున్నారా ? లేక బోరుకొడుతున్నదా ?"

"ఆఁ లేదు. ఫరవాలేదు చాలా ఇంటరెస్టింగా ఉంది. చెప్పండి" అంటూ శ్రద్ధగా వింటున్న ఆమె కంగారుపడింది

"అయితే మీ కర్మ వినండి" అనుకుంటూ తిరిగి మొదలుపెట్టాడు హరి

"అవి మా సంక్రాంతి సెలవలు. ప్రతీ సెలవలకు అన్నయ్య దగ్గరికే వెళ్లేవాడినని మీకు చెప్పనవసరంలేదనుకుంటా. ఇంతకుముందు ఎప్పుడు వచ్చినా కన్పించే అరుణ నా కిప్పుడు కన్పించటం లేదు. ఎందుకు కన్పించనట్టూ ? అని ప్రశ్నించుకొని, పెళ్లి నిశ్చయమైనదని సిగ్గు కాబోలు అని సర్దు చెప్పుకునేవాడ్ని

"ఆరోజు ఎందుకో వాళ్ల ఇళ్లు దాటేసి వచ్చిన తరువాత వెనుకకు తిరిగిచూసా హఠాత్తుగా మేడ మీద తలుపుచాటునుంచి నన్ను చూస్తున్న అందమైన అరుణ నాకు కన్పించింది "అమ్మ దొంగా! నీ పని యిట్లా ఉందా? ఆగు నీపని చెప్తా" అన్నట్టు చూశా. ఏదో వూహ కల్గింది అలాంటి వూహలు కల్గాలే కాని ఆచరణలో పెట్టటం చాలా తేలిక. తిరిగి కాలేజీకి వెళ్లిపోయా. ఇప్పటినుంచే మొదలు పెట్టాలి అని మొదలెట్టా వో మంచిరోజు చూసుకుని

"మా వివాహం ఆ వేసవిలోనే అందుకని మేం నిరభ్యంతరముగా లెటర్సు వ్రాసుకొనేవాళ్లం

"ఇక నే చెప్పలేను. దయువుంచి ఈ లెటర్సు చదువు" అంటూ డైరీలోంచి 4 లెటర్సు తీసి యిచ్చాడు.

భారతి చదవడం ప్రారంభించింది.

ఫిబ్రవరి—14—63,

ప్రియమైన అరుణకు, బెంగుళూరు.

హరి దీవెనలతో వ్రాయునది. నీకో ముఖ్య విషయం చెప్పాలని ఉంది. మేము ఎక్కే బస్ స్టాపు ముందు వో అరడజను మంది అమ్మాయిలు ఎక్కుతుంటారు. అందులో రజీ అనే అమ్మాయి నన్నాకర్షించింది. ఒకరోజున మేమంతా తిరిగి వస్తున్నాం కాలేజీనుంచి. అంటే వాళ్ళు కూడా ఉన్నారన్న

తాను. వాళ్ళ స్టేషన్ రాగానే, వాళ్ళకంటే ముందే మేము అంటే ఈశు, నేను దిగి వాళ్ళని ముందు పోనిచ్చి, మేం వెనకపడ్డాం. నే చెప్పిన అమ్మాయి ఒక ఇంటిలోనికి వెళ్ళి, ఎవరో అబ్బాయికి చీటి యిచ్చి మావద్దకు పంపింది. ఆశ్చర్యపోయాం. అందమైన అమ్మాయి దగ్గరనుంచి కాఫీకి ఆహ్వానం. "కాఫీకో, దేనికో బాబు, నేను రాను" అంటూ ఈశు వెళ్ళిపోయాడు. నేను "ధైర్యే సాహసే లక్ష్మీ" అనుకుంటూ ఆ కుర్రాడి వెనకాలే వెళ్ళా. రజీ వాళ్ళ నాన్నగారికి నన్ను పరిచయం చేసింది. నేను, తన ముఖ్య స్నేహితుడ్నంటూ. రిటైర్డు డి. ఎస్. పి అయినవాళ్ళ నాన్నగార్ని చూసి, భయపడుతున్న గుండె కుదటపడింది. నా గురించే ఎన్నెన్నో గొప్పలు చెప్పేసింది. ఈమె కిన్ని విషయాలు నాగురించి ఎలా తెలుసా ! అని ఆశ్చర్యపోవటం నా వంతయింది. వాళ్ళ యిల్లు, ముఖ్యంగా రజీ గది, రజీకన్నా అందంగా ఉందనుకో. రజీకి యిద్దరు తమ్ముళ్ళు. తండ్రే తల్లిదండ్రుల పోస్టులు నిర్వర్తిస్తున్నాడు

మిగిలినవి మరోమారు. నీ ప్రియమైన,

హరి

మొదటి ఉత్తరాన్ని మడిచి రెండవదాన్ని చదవటాన్కి ఉపక్రమించిం దామె

మార్చి—1—63,

ప్రియమైన అరుణకు, బెంగుళూరు

హరి ప్రేమతో వ్రాయునది. రజీ వాళ్ళ యింటికి తిరిగి వెళ్ళకూడ దనుకున్నా. అంటే నా గురించి దాయాదులను సహితం దూరంచేసుకుంటున్న నిన్ను మోసం చేయకూడ దనుకున్నా. కాని రజీ నౌఖరు మా రూము కొచ్చాడు. "అమ్మగారు అలిగారు. భోంచేయటంలేదు. బాబుగారు మిమ్మ తీసుకురమ్మన్నారు" అన్నాడు. అది రెండవరోజట ఆమె అలిగి. బహుశా ఆమె వ్రాసిన "లోకల్—లెటర్సు" కు నేను జవాబీయలేదని కాబోలు. మధ్యాహ్నము కాలేజీ మానేసి వాళ్ల యింటికి వెళ్ళా. అందంగా ఉండే రజీ ముఖం, కళా విహీనంగా ఉంది. ఎంత బాధపడ్డానో, అనవసరంగా ఆమెను నొప్పించినందుకు. అలకకు కారణం నేను జవాబీయలేదనేనట. ఆమె నా కిస్తున్న విలువకు ముగ్ధుడ నయాను. సినిమాకు పోదాం అంది ఆ క్షణంలో ఆమెను బాధపెట్టటం యిష్టంలేక, ఆమె ఆజ్ఞలను పాటించటం నావంతయింది రెండవ రిక్షాను పిలుస్తున్న నన్ను వారించింది ఇంగ్లీషు సినిమాకు వెళ్దాం అంది. "లవర్స్ మస్ట్ లెర్న్" చూశాం. మరలా ఒకే రిక్షాలో వాళ్ల ఇంటికి వెళ్ళాం వాళ్ల యింటివద్దనే భోజనంచేసి ఇంటికి వెళ్ళిపోయేటప్పుడు చచ్చినా యిక పిల్లింటికి రాకూడదు అనుకున్నా.

అరుణా ! నీ కసూయగా లేదూ ? నీకు నిశ్చయమైన నేను, నీ పరోక్షంలో మరో అమ్మాయితో తిరుగుతుంటే నిన్ను నేను మోసం చేయనులే నిజంగా మోసంచేసే ఉద్దేశ్యమే కనుక ఉంటే నీకీ విషయాలు చెప్పనుగా. నమ్ముతావుగదూ నీ హరిని. నీ ప్రియమైన,

హరి

పూర్తిగా చదివిన ఆమెనుంచి ఆ ఉత్తరాన్ని తీసుకొని మరోటి యిచ్చాడు. ఆమె చదువుతుంది అత నామెనే చూస్తున్నాడు, ఆమె భావాలను చదవటాన్కి.



మార్చి—15—63,

ప్రియమైన అరుణకు, బెంగుళూరు.

ఏ ఇంటికైతే తిరిగి వెళకూడ దనుకున్నానో ఆ యింటికే తిరిగి వెళ్ళవలసి వచ్చింది. తీవ్ర జ్వరంతో బాధపడుతూ నీ హరికోసం కలవరిస్తున్న రజీ యింటికి వెళ్ళా, ఆమెను రక్షించటానికై పిచ్చిగా ఆమె కోరిన కోర్కెను కాదనలేకపోయా. నా వంతంకన్నా ఆమె ప్రాణమే ముఖ్యమని గ్రహించా. నే నిప్పుడు "ఈశు" తో లేను. రజీ వాళ్ల ఇంటిలో ఉన్నా. నా ముఖ్య స్నేహితులలో రజీ ఒకరు యిప్పుడు రజీ మామూలు మనిషైంది. త్వరలో "ఈశు" దగ్గరకు వెళ్ళిపోతా. నీవు జాగ్రత్తగా చదువుతున్నావు కదూ ! ఈ సంవత్సరము మీకు గ్రూపు ఒక్కటేగా. మరి పూర్తిగా ప్యాసుకావాలి. ఇంజనీరు భార్యకు ఆమాత్రం బి.ఎస్ సి డిగ్రీ అయినా లేకపోతే ఎట్లా జాగ్రత్తగా చదువు. మరొకరికి కాలేని నీ,

హరి

"ఇదే ఆఖరి ఉత్తరం" అంటూ యిచ్చిన ఆ ఉత్తరాన్ని చదువుతుందామె. అతను ఆమెనే చూస్తున్నాడు.

పెద్దమనిషి : (డాక్టరు గారితో) రెండు రోజుల్నుంచి నా గుండె చాలా వేగంగా కొట్టుకుంటూవుందండి.

డాక్టరు : అయితే వుండండి. ఆగి పోయేందుకు ఘాటైన మందిస్తాను.

యస్. వి యస్. రెడ్డి (హైదరాబాద్)

మార్చి—30—63,

అరుణా ! బెంగుళూరు.

నిన్ను ప్రియమైన అని సంబోధించటాన్కి కూడా లేను తగను క్షమిస్తానంటే వో విషయం చెప్పాలని ఉంది. అరుణ నన్ను క్షమిస్తుంది. నేను నీకు తగను నీ అంత మంచివాడ్ని కాను నేను నేను స్వలాభిని. స్వార్థపరుడ్ని. నేను రజీ త్వరలో వివాహం చేసుకోబోతున్నాం. వాళ్ళ నాన్న, నన్ను అమెరికా పంపుతా నన్నారు. మరో జన్మలో నైనా మన కోర్కె ఫలిస్తుందని ఆశిద్దాం. నీ కాలేని,

హరి.

తరువాత హరి చెబుతున్నాడు ఆమె వింటున్నది.

నా మొదటి మూ డుత్తరాలకు జవాబు రాలేదు కాని, ఆఖరిదానికి మాత్రం వెంటనే జవాబొచ్చింది. జవాబుగా వచ్చిన అన్నయ్య తనతో రమ్మన్నాడు. అరుణకు సీరియస్‌గా ఉందట. అన్నయ్యతో ఏమీ మాట్లాడలేకపోయా. అరుణను చూడటాన్కి ఆత్రుతపడుతున్న నన్నర్థం చేసుకున్నట్లుగా, రైలు దిగగానే హాస్పిటలుకు తీసుకెళ్ళాడు అన్నయ్య. అరుణ బెడ్‌పై కూర్చున్నా. అప్పుడే స్మారకంలోంచి తేరుకున్న ఆమె నా చేతి వ్రేళ్ల తన మనుష్యైన లేదు పాలిపోయిన బుగ్గలకు వ్రాసుకుంటూ ఏదో గొణుగుతోంది నా కర్థంకాలేదు. నాలో దుఃఖం పెల్లుబికి వస్తుంది ఆమె అధరాలను, పరిసరాలను గుర్తించకుండా ముద్దిడా

కాని అవి జీవంలేని అధరాలు. ఆమె జీవం లప్పటికే అనంతవాయువులో కల్సిపోయింది

పిచ్చిగా ఎవరితోనూ మాట్లాడలేక కాలేజీ చేరుకున్నా. ఏదో కవరొచ్చిందని, రూమ్—మేట్ నా కిచ్చిపోయాడు.

అది, లేని నా అరుణ నుంచి వచ్చింది. అందులో నా ఉత్తరాలతోపాటు వో కాగితం ఉంది అందులో అరుణ వ్రాసినవి—

ప్రియమైన హరికి,

ఎప్పటికైనా మీరు నాకు ప్రియమైనవారే. మీ ఉత్తరాలన్నీ అందాయి. ఏమని జవాబీయాలో తెలియక ఈయలేదు. ఆడది ఒక్కరికే మనసీయగలదు నేను మనసారా మిమ్మలనే ప్రేమించా. మీరులేని ఈ జీవితాన్ని భరించలేను మరో జన్మలోనైనా కలుద్దాం అని వ్రాశారుగా. ఆ ఆశతో ఆలస్యాన్ని భరించలేక ఈ జీవితంనుంచి నిష్క్రమించదలుచుకున్నా.

అరుణ

అదే నా జీవితంలో తొలి షాక్. ఉత్తరం చదివి కుప్పగా కూలిపోయిన నన్ను ఈశు వారించాడు. "నీవేం హంతకుడవు కావు నీకేం శిక్ష విధించవీ చట్టాలు" అనేవాడు. నేనే, హంతకుడనంటున్నా. ఆ సంవత్సరము చదువు కూడా అయిపోవచ్చింది. "జాగ్రత్తగా చదువు రెండు నెలలలో పరీక్షలొచ్చేస్తున్నాయి" అని అనేవా డతను. కాని చదువు మీదే కాదు, జీవితంమీద కూడా విరక్తి కల్గింది. కాని, నన్నింత కష్టపడి చదివించిన తల్లిదండ్రులను మోసం చేయలేను. ఈ జీవితం నుంచి నిష్క్రమించలేను. అరుణంత ధైర్యం నాకు లేదు. నేను అరుణకు దేనిలో కూడా సరికాను అదే నా చదువుకు ఆఖరు.

అరుణతో నా హృదయమంతా నిండిపోయింది. మరొకరి కందులో ఖాళీ లేదేమో. అందుకే అన్నయ్య బలవంతం పెట్టటంలేదు పెళ్ళి చేసుకోమని అని ముగించాడు ఆఖరి ఈ మాటలామె కర్థంకాలేదు

కన్నీళ్లతో నిండిన అతని కనులను చూడలేక, తన కొస్తున్న కన్నీటి నాపుకుంటూ అడిగిందామె.

"మరి రజీతో మీ వివాహం జరగలేదా ?"

అతను విషాదంగా నవ్వుతూ "అసలు రజీ అన్న అమ్మాయి ఈ లోకంలో ఉందో లేదో తెలియదు నాకు ఉన్నా నాకు ఫ్రెండ్ మాత్రం కాదు. తీవ్ర జ్వరంతో బాధపడుతూ, నాకోసం పరితపించే యువతి అసలే కాదు. అదంతా నేను కల్పించిన కల్పన. అరుణను ఏప్రిల్ ఫూల్ చేద్దామని వ్రాసిన ఉత్తరాలవి. అంతే ఇంకేమీ కాదు" ఇద్దరూ లేచారు

"తీగలు తెగేవరకు సాగదీయడం వివేకం కాదు. అనురాగలత ఎంత సుకుమారమో, అంత కఠినం. ఎంత సున్నితమో అంత ప్రగాఢం. అతి కోమలంగా పెంచితేనే అది వికసించి పుష్పిస్తుంది" ఏదో కథలోని మాటలు గుర్తొచ్చి అనుకుంటూ అతడు గొణుక్కుంటున్నాడు. ★